# కుంటోడు

ఈ తిరపతిలో అంతో యింతో పరపతుండే మొగలాయిలు శానామంది ఉణ్ణారు. ఉండారు. అది వాళ్ల ప్రైతాపం కాదు. ఏడుకొండల వాడి చలవ. అదేందో ఒక సామెత చెప్పినట్టుగా వచ్చినోళ్లకు వండి పెట్టుకోని రానోళ్లకు ఎదుర్స్తూస్తా కూసుంటారంటారే! ఇటు మంటోళ్ల కతలంతా చూడబోతే యిట్టా మాదిర్నే!

సరే! వాడెవుడైనా సరే! పలానా దినం పలానా బండికో బస్సుకో వస్తా ఉండామని జాబు రాసినారనుకోండి. ఎగ బెట్టుకోని గెంట ముందుగానే పరిగిత్తా బొయ్యేది. తీరా ఆడికి పాయ్‌నాక రావాల్సిన రైలో బస్సో గెంట లేట్ అన్నారనుకోండి. ఆడ కూసోని వస్తా పోతావుండే మొకాల్ను నోరు తెర్చుకోని చూసుకుంటా నిలబడుకుండేది.

గెంట లేట్‌గా వస్తిందన్న బండో బస్సో దాని తాడు తెగ రాకుండా యాడ చస్తింది.? వస్తింది. అరగెంట అట్నో యిట్నోగా వస్తింది. వస్తానే ఏడుకొండలకు అవతల ఆడేణ్ణో ఉండేటోణ్ణి ఆణ్ణే చూసినట్టు గోయిందా! గోయిందా! అని కలవరించే ఆ ఎర్రి గుంపును దించుకుండేది. అల్ప సొల్ప మైనోళ్లయితే అట్టా యిట్టా పడి రొండు బస్సు టిక్కట్లు వాళ్ల దుడ్లతోనే కొని చేతిలో పెట్టి వదిలించుకుండేది. అట్ట గాకుండా ఆ వచ్చినోడు కూడా యీడి మాదిర్నే అంతో యింతో పరపతుండే వాడైతే యింక చూస్కో నాసామి రంగా! వాళ్ల వద్దంటా ఉణ్ణా పిల్లా జల్లనో మూటా ముల్లెనో ఎత్తి నెత్తి నేసుకుండేది. వాళ్ల ఎంట పడేది. కొండ మిందికి తీసుకోని పొయ్యేది. ఆడ ఎవుడో ఒకడి కాళ్లో చేతులో పట్టి ఆ నామాలోణ్ణి చూపించేది.

ఆడ్నికైపోతే పరవాలే కత! ఇంకా ఉండ్లా? వచ్చినోళ్ల తిరుక్కోని వాళ్ల కొంపలకు వాళ్ల పోవాల్నా వన్లేదా? అందుకని పడరాని పాట్లుపడి తిరుగు ప్రయాణానికి టిక్కట్లు సంపాయించి పెట్టేది. అప్పుడు వాళ్లను రైలో బస్సో ఎక్కించేది.

తలా మొలా రొండు బోడి చేసుకున్నోళ్ల బండెక్కి హి హి హి! అంటే ఈడు మెలికలు తిరిగిపోతా ఓహోహో! అనేది. ఆ బండి అట్టాపోతే ఈడిట్టా ఎలబారేది. ఎలబార్తే యాడికి పోవాల? కొంపకే!

ఇయ్యరవ దాకా మర్సి పాయ్‌న కొంప మాట యిప్పుడు మతి కొచ్చేకుందికి ఎప్పుడో చిన్నప్పుడు చదువుకుణ్ణె వేమన్న పద్దెం గ్యాపకాని కొస్తింది. దాంతో ఎన్నెమికిలో పుట్టింది చలి.

వేమన్నను ఎర్రోడన్నోళ్లు ఎర్రోళ్లు! పలికిన పలుకులు ఎటుమంటివి? వరాలు చేసే పలుకులే. మహన్నబావుడి అనుబోగం ఎటుమంటిది? చెవ్వులో జోరిగిని చెప్పులో రాతిని కంట్లో నలుసును కాల్లో ముల్లును యింటి పోరుతో పోల్సె. అయితే వాటి పోసుగూల! చెవ్వులో జోరీగిగానీ చెప్పులో రాయిగానీ కంట్లో నలుసుగానీ కాల్లో ముల్లుగానీ అవ్వి ఆడ ఉండే దాకనే బాద. కొంపలో కత అట్ట గాకుండా పొయ్‌నే. నువ్వు యింట్లో ఉండు. ఈదిలో పడు. ఆ తంట సటపటంగా వదిలి పెట్టే పెంటగాదే!

ఇట్టా మాదిర ఆలోచించుకుంటా గడపలో కాలు పెట్టేకుందికి-

''ఒరే అబ్బోడా! ఓ అమ్మీ!... అట్ట చూడండే! ఊడిపాయ. జారిపాయ. పట్టు యిడవడంటా నిన్ననంగా నిద్దరపడక మిందుండి లేచిపొయ్‌న మొగోడు. అయ్యోపాపం! కొండలు తొవ్వి పొల్లించుకోని వస్తా ఉండాడే. అయ్యయ్యో! అట్ట చూడండే! ఆ నెత్తిమింది బొళువుతో మెడ జివాలు యిరిగి పోతావుంటే చూస్తా నిలబడుకుంటే ఎట్నే? మీదూవు మిమ్మల్నెత్తుకోని పోనానీ!... పొయ్ దించుకోండే!'' అంటా కొంపలో ఆ యరవదాకా కొండల్నుగొట్టి పిండి చేసిన యిల్లాలు యాసణ్ణం పట్టింది.

అప్పుడు చూస్కో నా సామిరంగా! అరికాలి మంట ఉచ్చి కెక్కితింది. ఇస్కోమని యిడ్సి పెట్టే యాకీలు కాకీలు యిడి యిడిగా ఊడి పొయ్యేటట్టుగా నలగుమ్మచ్చు! అనిపిస్తింది కానీ- ఏంచెయ్యాల? ఎంత పుణ్ణెం మూట గట్టుకోని వచ్చినామో ఆ పుణ్ణెంతో కొంప ఎంత మిగిలి మిట్టన పడబోతిందో? అర్తం చేసుకోకుండా వాగితే మాటకు మాట పెరిగితింది. ఇంక కడుపుచించు కుంటే కాళ్లకాణ్ణే పట్టిందని ముగుజింబరం యేసిన గొడ్డు మాదిర్తో కుయ్ కయ్ మనకుండా లోపలికి పొయ్యేది. లోటా నీళ్ల ముంచుకోని కడుపు మంట చల్లారే టట్టుగా గుట గుట రొండు గుక్కలు తాగేసేది. ఇట్లా శానా మంది పుణ్ణాత్తులు ఆ కలియుగవైకుంటం అనబడే ఈ తిరపతిలో సంసారం గుట్టు యాది రట్టు అన్న సామెతను సార్దకం చేసుకుంటా వుంటారు.

ఆ తాన్లో పంచనేగదా నేను కూడా!

అందువల్ల ఆ పొద్దుటికి కొంపకల్లా మొకమెత్తి చూసి రొండు దినాలైపాయ!

రొండు దినాలుగా యింటి మొకం అట్టా చూడకుండా యిరగచేసి మెరుగుబెట్నె గనకార్రెం ఏముండాదబ్బా? ఎదా? చెప్పు చూద్దాం అంటే- అదే గదా యియ్యరవ దాకా సుత్తి కొట్టింది!

''సరే! యాడేడనుంచో వస్తారు. వచ్చినోళ్లు పాపాల్నంతా ఈడ యిడ్సి పెట్టేస్తారు. పుణ్ణాన్ని మూట గట్టుకోని రైలెక్కతారు. అట్టా మాదిర వచ్చినోళ్లంతా యిడ్సి పెట్టేసి పోతావుండే పాపాలతో రాజీపడి బతక్క తప్పదు గదా?'' అని ఆలోచించుకుంటా ఎలబారి వస్తా ఉండా.

ప్లాట్‌పారం శానా కోపు మింద ఉండాది. పొట్ట కర్ర కొచ్చిన జొన్న చేని మింద సీతాకోక చిలకలు పణ్ణెట్టు మంచి పాయం మిందుండే ఆడ పిలకాయిలు అట్టా యిట్టా

తిరగతా ఉండేది చూస్తావుంటే ఎన్ను చుట్టూ గువ్వలు తిరిగినట్టుండాది. కొన్ని మొగకండ్లు యిడ్సి పెత్తే చాలు. అమాంతంగా మింగేద్దా మన్నెట్టుగా వాళ్లెట్టా తిరిగితే అవ్వి అట్టా తిరగతా ఉండాయి. లేగ దూడల్ను యిడ్సి పెట్టేసి అడివికి మేతకు ఎలబార్తా ఉండే ఆవుల మాదిర కొందురు తల్లులు పోతావుంటే పాపం! పిలకాయిలు డీలా పడిపాయ్ చూస్తా ఉండారు. పిలకాయిల్ను సాగనంపతా పెద్దోళ్లు బుద్ది మాటల దండకాలు చదివిందే చదివిందిగా ఉండారు!

మరీ ఒక పెట్టి కాడైతే ఒక చిలకలాంటి చిన్నది. పెట్లో కూసోనుండాది. ఒక చిన్నోడు ప్లాట్‌పారం మింద ఆ చిలక్కు ఎదురుగా నిల్సుకున్నాడు. వాళ్లిద్దురికీ మద్దె కిటికీ కమ్మిలే అడ్డం. ముసి ముసిగా నవ్వుకుంటా మూతిలో మూతి పెట్టి ముచ్చట్లాడు కుంటా ఉంటే నాసామిరంగా! ముక్కూ ముక్కు మోటుకున్నాయి. ఆ చూడ సోద్దిం ఎట్టుండాదంటే చిలకా గోరింకిలు ముక్కులో ముక్కు బెట్టి ముది గారం చేసినట్టుండాది. చూసినంత సేపూ చూడాలని పిస్తా ఉండాది. దుడ్డూ దుగ్గాణి కర్సు లేని యవ్వారం గదా?

''ఒరే నాయినా! కొంప కల్లా మొకమెత్తి చూసి రొండు దినాలై పాయ. ఈ మోజులో పడి అది మర్సిపోతా ఉండావు. ఇంటికి పోతే మీ బాశాలి ఉండాది. ఆపె చేతిలో నీ ముక్కు దొండ పొండు రంగు తిరిగితింది. అది మర్సిపోతే ఎ(బా'' అని మణుసు ఎచ్చరించే కుందికి ఎగిరట్టా పడి ముందుకు నడస్తా ఉండా. ఇంగొక్క రొండు నిమిశాల్లో టేసిన్ దాటుకోని బయిటికొచ్చేస్తా. అంత లోకే ఆయన ఎదురుపడె!

ఆయన ఒక అతికారి. శానా పెద్ద అతికారి. అంటే ఆయనకేమన్నా రొండు కొమ్ములుండాయా? అంటే కొమ్ముల కేముండాదిలే? ఆవులకూ ఉంటాయి. మేకలకూ ఉంటాయి. అట్టా మాదిర అతికారమనేది ఎవుడికి తగినట్టు వాడికి ఉంటింది. అయినా ఆ మహన్నుబావుడి అతికారం ఉండాదే అది సటపట మయింది కాదు.

ఆయన ఎప్పుడు మడతట్టా నలక్కుండా మల్లిపువ్వు మాదిర్తో ఉండే గుడ్డలే ఏసుకుంటాడు. ముంజేతులదాకా ఉండే పొడుగు చొక్కాయిని లోపలకు తోసేసి మిడిమల కిందికి దాకా ఉండే సొరాయిని దాని పైనేసి బిల్టుతో బిగించు కుంటాడు. మేక మెడ కింది చన్నుల మాదిర్తో రంగు రంగుల గుడ్డ పేలికొగిటి మెడ కింద యాలాడ్తా ఉంటింది. ఇంక తొడుక్కోనుండే బూడ్సులా? నీడ చూసుకోవచ్చునేమో అనేటిగా నిగ నిగా మెరస్తా ఉంటాయి.

అయితే పాపం! ఆయన కుంటోడు!

ఎడంకాలు మామూలుగానే ఉంటే కుడికాలు రొంత చిన్నది. ఆ చిన్నకాలిని పెద కాల్తో సమంగా చెయ్యాలని కుడి కాలికి తొడుక్కోనుండే బూడ్సును పెసల్‌గా పిడికెడెత్తుకు పైగానే కుట్టించు కున్నాడు. అయినా కుంటకుండా నడవాలంటే కుదరదు. కుంటతా నడవలేకుండా చేతి సంచీని ఈ చేతి కాచేతికి మార్సుకుంటా నడవలేకుండా నడస్తా ఉంటే నా మణుసు చివుక్కుమనె.

ఈ లోకంలో చూసిందానికంతా వేడికి ఎన్న కరిగినట్టు కరిగిపోతా ముసిలి కన్నీళ్లు

గార్సే ముండ మోపి నాయాండ్లుండారు. అట్ట గాకుండా అయ్యో! మని యాడ బడిందాన్ని ఎత్తి నెత్తినేసుకోని తిత్తీ నెత్తీ రొండూ కొట్టించుకుండే ఎరి ముండలు గూడా లేకుండా పోలేదు. అటుమంటోళ్లు నూటికో కోటికో ఒకరుండంగానే పొద్దు పుట్టి తెల్లార్తా ఉండాదిరా అబ్బోడా! అని మాయమ్మ శానా శానా తెల్సిన దాని మాదిర్తో చెప్తా ఉండె!

సరే! ఎదురు పణ్ణె ఆ పెద్ద అతికారి నన్ను చూసి నవ్వే కుందికి నేను గూడా నవ్వితి. లేకుంటే బాగుంటిందా? ఆ మిందట ఆయన దోవ ఆయనిది. నాదోవ నాదయ్యుంటే ఎవుడి దోవ వాడి దయ్యుండు. అట్ట గాలా!

''ఈ బండికే వస్తా ఉండారా మీరు గూడా?'' అని అడిగె.

''తిరపతి వాళ్ల కత తమరికి తెలియంది ఏముండాది సార్? వచ్చినోళ్ల మూటలు దించుకోని పొయ్యేవాళ్ల పిల్లా జెల్లాను బండి ఎక్కించేదే గదా?'' అనేకుందికి ఆయన పక పక నవ్వె. నేను గూడా ఏడ్సి మొకం కడుక్కుణ్ణెట్టుగా నవ్వతా ఆయన చేతిలో సంచిని అందుకోపోతే–

''అయ్యయ్యో! మీరా... అయినా ఈ సంచి ఏం బొరు వుండాదిలే? వద్దొద్దు!'' అంటానే యిడ్సి పెట్టేసె. ఆ సంచి నాచేతికి తగులు కుండె.

ఎండా కాలం నాలుగు చినుకులు రాల్తే పుట్లో ఈసుళ్ల లేచినట్టు ప్లాట్ పారం మింద జనం. ఆ గుంపులో నడవ లేకుండా ఆయన నడస్తావుంటే అడుగుమింద అడుగ్గా కూడా నేను గూడా నడస్తా ఉండా!

''ఒరే! ఊళ్లో కొంపలే లేనట్టు ఈ ప్లాట్‌పారమే దొరికిందా మీకు! రామేశ్వరం పొయ్‌నా శనేశ్వరం వదల్లేదన్నెట్టు ఈ దరిద్రం ఈడి గ్గూడా దాపరించాల్నా? ఛీఛీ! అయిదు నిమిశాల్లో బండి ఎలబార బోతిందని మా బాదలు మావిగా ఉంటే నడిమిద్దె రంకు మొగుళ్ల మాదిరి ఈళ్లు!''

మోకాళ్ల కిందికి దాకా జుబ్బా ఏసుకోనుండే మొనగోడు చేతులు తిప్పతా తిప్పతా కసురు కుణ్ణాడు. ఆయన అట్టా మాదిర చేతులు తిప్పతావుంటే మమ్మ చూడు! మా అందం చూడు! అంటా ఏలేలికుండే ఉంగరాలు ఎలిగిపోతా ఉండాయి.

ఆ ప్లాట్‌పారం మింద కాలి కాలికీ మొక్కతా అడుక్కుంటా ఉణ్ణె బిచ్చగాడు ముందుకు కదిల్నాడు. కదిల్నాడంటే రొండు చేతుల్ను నేల కూనుకోని బలింతంగా మొండాన్ని ముందుకు కదిలించి నాడు. అంటే దేకినాడు. వాడికి రొండు కాళ్లులేవు! అది చూసేకుందికి ఆ పెద్ద అతికారి యాడ వాడొచ్చి కాళ్ళు తాకతాడేమో అన్నెట్టుగా మందగుదొచ్చిన గొడ్డు మాదిర గబ గబ రొండడుగులేసి దూరంగా తొలిగి పాయ.

''ఈ దేశింలో ఈ బెగ్గర్ ప్రాబ్లమ్ ఉండాదే? – ఏ కంట్రీలో గూడా లేదండీ. వాళ్లు అడగతా ఉండారని మనం యిచ్చే కుందికి యిది యిట్లానే పెరిగి పోతా ఉంటింది. తప్పు మనలో గూడా ఉండాదిలే!'' అనె.

ఏం బొదులు చెప్పాలని ఆలోచించే కుందికి ఆయన ఎక్కాల్సిన పెట్టి కాడికి వచ్చేస్తిమి.

మేము ఆ పెట్టి కాడికి రావడం. ఆ రైలు పెట్లో చెత్తా చెదారం ఊడస్తా ఉణ్ణె పిలగాడు ఊడ్సిన చెత్తను బయిటికి చల్లడం రొండూ వొగిటే పారిగా జరిగిపాయ. శెనిక్కాయిల పొట్టు... దుమ్మూ దూళీ పెట్టెక్కి పోతావుండే అతికారి మింద పడె. ఇంక చూస్కోండి! -

''ఒరే యిడియట్! బుద్ధుందా నీకు? ఇక్కడ నిన్ను చెత్త ఊడ్సమన్న వెదవ ఎవుడ్రా? పోనీ! బండి బయల్దేరేది యిక్కడి నుంచే గదా? ఇంతలో ఏమి ఆరక పొయ్యిందని నువ్వీ సోషియల్ సర్వీసుకు పూనుకుణ్ణావ్? చూడు నిన్నేం చేస్తానో?''

అతికారి ప్లాట్‌పారం మింద దాందూం లాడ్తా ఉండాడు.

అంతలోనే గార్డు యిజిలేసె. అట్ట చూసేకుందికి పచ్చ జండా ఊపతా ఉండాడు.

''సాసా! బండి ఎలబార్తా ఉండాది. ముందు మీరు బండెక్కండి సా!'' అంటా ఆయన్ను పట్టు బలింతాన బండెక్కిస్తి. చేతికి సంచి అందిస్తి. బండి ఎలబారి పాయ. ఇంగొక్క రొండు నిమిశాలు ఉణ్ణుంటే?- అనుకుంటా తిరిగి చూసేకుందికి రైలు పెట్లో చెత్త ఊడ్సుకుంటా బతికే ఆ పిలగాడు! ఒక చెయ్యిలేదు. ఒక కాలు కుంటి. వాడా అతికారి చేతిలో పడుంటే? -

ఇట్టా తిరిగే కుందికి ఎదురుంగా ముత్తారెడ్డన్న!

నన్ను చూసి పక పక నవ్వె!

''ఎందుకన్నా అట్టా నవ్వతా ఉండావే?''

''నువ్వు చేసిన గనకార్నానికి!''

''ఇది పాయ్ ఒక గనకార్నమా? ఏందో పాపం. ఒక కాలు అవిటి. నడవ లేక నడస్తా చేతిలో సంచితో అగసాట్లు పడ్తా ఉంటే అందుకుంటి!''

''అందుకుంటివో ఆదుకుంటివో మొత్తానికి ఆయన సంచి మోసినావు. అదే ఒక కూలోణ్ణి పెట్టుకోనుంటే వాడెబ్బ గంటేమన్నా పోతిందా?''

''ఆ సంచీ ఆయన సెగితికి జాస్తి. కూలోడికిస్తా మంటే తక్కవ. ఇంకేం చెయ్యాల?''

''అందుకే మోసినా వనుకో! అయితే ప్లాట్‌పారం మింద అడుక్కుంటా ఉణ్ణోడు. రైలు పెట్లో చెత్తూడ్సిన పిలగాడు- యిద్దరూ అవిటోళ్లు గాదో?''

చెంప మింద చెళ్లుమని దెబ్బ పడి నట్టాయ! తడిమి చూసుకుండే దానిగ్గూడా అవకాశిం ఈకుండా-

''ఒరే అబ్బోడా! అంతో యింతో తెల్సిన నీబోటోడు ఏమీ తెలవనోడు యిద్దురూ యిట్టా మాదిర కలిగినోడికో అతికారం చలాయించే వాడికో మూటలు మోసినంత కాలం లోకానికి ఈ కుంటి నడక తప్పదురా!'' అనేసి తన దోవన తాను పాయ!

నాలుగ్గాళ్లమండపం సాచ్చిగా చెప్తావుండా అట్టా యిట్టా చూసేకుందికి నాకంటికి అందురు కుంటోళ్లుగానే అవుపిస్తా ఉండారు! ●